


**(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)**

# 4

All happy families resemble one another, each unhappy family is unhappy in its own way. -- Leo Tolstoy

***

"వంటవుతోందా ఇంకా..?" కిచెన్ గుమ్మానికి ఆనుకు నిలబడి అడిగాడు వంశీ.

"నాకేం వందచేతుల్లేవ్.."

"మనింట్లో వందమంది లేరు.." నాలుక చివరనే మాటని ఆపేశాడు. అలమరలో నుండి చింతపండు డబ్బా తీసి కిచెన్ ప్లాట్ఫాం మీద పెట్టింది. ఓ బౌల్ లో కాస్త చింతపండు వేసి స్టవ్ మీద చిన్న గిన్నెలో వేడెక్కుతున్న నీళ్ళు దానిలో పోసింది. తరిగి ఉంచిన ఆనపకాయ ముక్కల్నీ, పక్కనే ఉన్న ములక్కాడనీ చూసి "సాంబార్.. మరో పావుగంట కనీసం.." అనుకున్నాడు.

"నేనలా బయటికెళ్ళి రానా..?"

"ఊరేగు.." కళ్ళెత్తి చూడకుండా సమాధానం చెప్పింది. సోగకళ్ళు .. *కళ్లెత్తితే సాలు కనకాబిసేకాలు..* ఉహూ.. ఆ కళ్ళలో నవ్వులు కురిసే అవకాశమే లేదా? వంశీ నెమ్మదిగా నడిచి ఆమె వెనకగా నిలబడ్డాడు. టొమాటోలు కడుగుతోంది సింక్ దగ్గర నిలబడి. గాఢంగా హత్తుకున్నాడు. తన స్పర్శ సీమకి తెలియచెప్తే బాగుండుననిపించింది.. "I care for you.." అని.

"వదులు.." మూడే మూడు అక్షరాల్లో కావల్సినంత ఈసడింపు.

"సీమా.. ఎందుకంత చిరాకు?" మాటల్లో అనునయం నింపుతున్నాడు.

"నువ్వు పనిలో ఉన్నప్పుడు పిలిస్తే బెల్లం కొట్టినరాయిలా కూర్చోవూ? ఏం.. నువ్వు పిలవగానే పక్కలోకి....."

"ఆపు.." విసురుగా విడిపోయాయ్ చేతులు. వెనక్కి తిరిగి చూడనైనా చూడకుండా వెళ్ళిపోయాడు.

"ఉన్నమాటంటే ఉలుకనీ.. నీకు ఖాళీ ఉన్నప్పుడే నేను గుర్తొస్తాను. లేకపో..." మాటలు గాల్లో కలిసిపోన్నాయి. చెప్పుల్లో దూరిన కాళ్ళు నడుస్తూనే ఉన్నాయి.

***

"నేనేమన్నానసలు! ఎక్కడికీ అలిగిపోయావ్? బాగా చెప్పిపెట్టిందావిడ. ఒక్క పూట చాలదూ మనసులు విరిచేయడానికీ.." బెండకాయ వేపుడు కంచంలో ఓ మూల చేరింది.

మౌనంగా అన్నం వడ్డించుకున్నాడు.

"మూగమొద్దులా మాట్లాడకపోతేనే సంసారాలిలా ఏడుస్తున్నాయ్."

ఒకే ఒక్క మాటలో తన శేషప్రశ్నకి సమాధానం చెప్పేసింది కదా అనుకుంటూ నవ్వుకున్నాడు.

"దేనికి నవ్వు? నా మొహాన కోతులాడుతున్నాయా?"

"నీకిష్టం లేదన్నావు కదాని ఊరికి ఒక్కణ్ణే వెళ్ళొచ్చాను. అదీ ఒక్క పూట. దానికింత రాద్ధాంతం అవసరమా సీమా?" సూటిగా కళ్ళు కలిపాడు.

"నా నోరొక్కటే వినిపిస్తుంది కదా! ఎందుకు వెళ్ళిపోయావ్ బయటికి? అది చెప్పు ముందు."

"చెప్తా. నువ్వు తిను ముందు.." కంచం వైపు చూపిస్తూ చెప్పాడు.

"మింగుతాన్లే. తప్పదు కదా బతకాలంటే.."

"ప్రతీచిన్న విషయానికీ బతుకులూ, చావులూ దేనికి సీమా? ఏమయిందసలు? హగ్ చేసుకున్నాను. తప్పేముంది? అంత ఈసడించాలా?"

"అను.. ఎన్నైనా అంటావు. చివరికి నాదే తప్పని నిరూపించడమే కదా నీక్కావల్సింది? మొన్న నిరూపించి వచ్చావు కదా.. నాకు జనాల పొడ గిట్టదని. ఇంకేమైనా ఉంటే కానిచ్చేయ్. ఓ పీడా పోతుంది." ఎర్రగా కందిన ముక్కు అదురుతోంది.

దీక్షగా ఆమెను చూస్తూ చెప్పాడు.

"సీమా, వాళ్ళకి  నా అవసరం ఉంది. అప్పుడప్పుడైనా వెళ్ళాలి. నీకు నచ్చకపోతే నువ్వు రాకు. వాళ్ళేమన్నారు, ఏమనుకుంటారు.. వదిలేయ్ ఇవన్నీ. లేనిపోనివి ఊహించుకుని  నీ మనసే పాడుచేసుకుంటున్నావు. మంచిది కాదు."

"ప్తూ.. కొత్తగా పాడవడానికేముంది! నా వెనక వాళ్ళేమనుకున్నా పట్టించుకోకూడదు. ఇంతేగా నువ్వు తేల్చిన విషయం! బావుంది వంశీ.. నాకు మాత్రం విలువ ఇవ్వవు." కంచం విసురుగా తోసేసింది.

"నీ విలువకేమొచ్చిందిప్పుడు? నువ్వొద్దన్నావని వెళ్ళకపోతే.. అప్పుడా నీ విలువ తగ్గనట్టు?"

"నేనేం వద్దన్ను నాయనా.. ఊరేగండి అందరూ. ఏదో ఒక రోజు చస్తాను. మీకు ఏకనిశ్చింత!" ఉక్రోషం, క్రోధం జమిలిగా.. సీమ గొంతులో

"మాటకి మాట తెగులు.." కంచంలో మిగిలిన అన్నంలో పెరుగు వేసేసుకుంటూ గొణుక్కున్నాడు.

"ఏం.. అయిపోయిందా? తిండి మీద చూపించకు. ఆ పాపం నాకెందుకు?"

మూడే ముద్దల్లో పూర్తి చేసి, వాష్ బేసిన్ వైపు నడిచాడు.

"నా వల్ల నీ ప్రాణానికి సుఖం లేదు. పోతాన్లే. నువ్వు హాయిగా ఉండచ్చు."

సోఫాలో కూర్చుని టీవీ ఆన్ చేసాడు.

*"... సాదరంగా వేదికపైకి ఆహ్వానిస్తున్నాను."* బాలూ పిలుస్తున్నాడు. *"నువ్వే దిక్కని నమ్మడమా... నీ ఆలయమును నిర్మించడమా..... సీతారామస్వామీ.. నే చేసిన నేరమదే నమీ!"* నవ్వుకున్నాడు వంశీ.

"నేను తప్పు ఇంకేదైనా, ఎవర్తైనా.. మొహం వికసించేస్తుందేం.!" ఏ పదాన్ని ఎలా పలకాలో చాలా కొద్దిమందికే తెలుస్తుంది.

*".... అమ్మా అని కొత్తగా మళ్ళీ పిలవాలనీ.. తుళ్ళే పసిప్రాయమే మళ్ళీ మొదలవ్వనీ.."*

అటు చూసిన వంశీకి కిచెన్ లోంచి శబ్దాలు వినిపించాయ్. ఒక్కోసారి మనుషుల కంటే వస్తువుల మాటలు సుఖంగా ఉన్నాయనిపిస్తుంది.

*".. నువ్వు కావాలే అమ్మా.. నను వీడొద్దే అమ్మా.."* మనసుకెక్కట్లేదు. మనసెక్కడుందో తెలియట్లేదు.

***

"నీతో మాట్లాడకూడదు వంశీ.. కానీ ఫోన్ ఆన్సర్ చేసాక మాట్లాడకపోతే డబ్బులు వేస్ట్ కదా?" హలో అని కూడా అనకుండా సాధింపు మొదలుపెట్టేసింది మహతి.

"పోనీ మానేసి చూద్దామా?"

"ఓయ్.. ఏమైంది?"

"చిరాగ్గా ఉందిలే." తమాయించుకుని.. "వర్క్ ప్రెషర్.." అన్నాడు వంశీ.

"ఎప్పుడూ ఉండేదేగా! కప్పాఫ్ కాఫీ తో పోతుంది. అయితే ఆ కాఫీ పాండీ కేఫ్ లో తాగాలన్నమాట." గలగల్లాడింది.

సగం టెన్షన్స్ ఈ పిల్ల పోగొట్టేయగలదసలు! Contagious laugh.. నవ్వుకున్నాడు.

"ఏం.. వస్తున్నావా. మరో అరగంటలో?"

'తమ్ముళ్ళె వరూ లేరు కానీ మహతీ నీకూ.. క్షణాల్లో పెళ్ళె ళ్ళు చేసేయగలవు!"

"సారీ.. జోక్ అర్థం కాలేదు. అట్నుంచి అటు ఇంటికెళ్దాం. నీకో మంచి విషయం చూపించాలి."

"షూర్! కానీ రెండూ కుదరవు. టైం సరిపోదు. కాఫీ నీ కిచెన్ లోనే. ఏం? సీయూ మహీ.." ఎరుపూ, బిస్కెట్ రంగు కుచ్చుల గౌను వేసుకుని పరుగుపరుగున ట్యూషన్ కి వస్తున్న మహతి గుర్తొచ్చినప్పుడల్లా పిలిచే పిలుపది.

***

"టడా.... బావుందా?" బెడ్రూమ్ గోడకున్న ఫ్రేమ్ చూపిస్తూ అడిగింది మహతి.

"వావ్!! షూటింగ్ స్టార్స్.. నేనూ ఆ రోజు చూసాను తెలుసా?"

"గ్రేట్! ఇక్కడికి రాలేదుగా.." మూతి ముడిచింది.

"కుదరలేదులే. సారీ! ఇంతకీ ఎక్కడ కొన్నావిది?" 16x20 సైజ్ ఫ్రేమ్ లో, నల్లటి ఆకాశంలోంచి ఏటవాలుగా దూసుకొస్తున్న జెమినిడ్స్ వైపు చూస్తూ అడిగాడు.

"కొనలేదు. గిఫ్ట్!" గర్వంగా చెప్పింది.

సన్నగా ఈలవేసి "అబ్బో! ఎవరా రొమాంటిక్ హీరో? నిన్ను బుట్టలో వెయ్యాలంటే మంచి దారే కనిపెట్టాడసలు!" నవ్వాడు వంశీ.

భుజం మీద చరిచి చెప్పింది. "అంత సీన్ లేదు బాబూ! గౌతమి ఇచ్చింది."

"గౌతమి?"

'ఊ.. ఫోటోగ్రాఫర్ కదా! ఆ రోజు ఎప్పుడు తీసిందో తెలీదు కానీ.. భలే కేప్చర్ చేసింది. మర్నాడు సాయంత్రం నేను ఇంటికొచ్చేసరికి సర్ప్రైజ్! కూల్ కదా! అచ్చం ఆకాశాన్ని గోడమీద అతికించేసుకున్నట్టే ఉంది. పర్ఫెక్ట్!" మురిపెంగా చూసుకుంటూ చెప్పింది.

"ఓ.. తనకీ చుక్కలు చూసే అలవాటుందా?" ఆలోచిస్తూ అడిగాడు.

"చుక్కలు చూడడమేంటీ.. స్టార్ గేజింగ్! తెలుగుని నువ్వు ఉద్ధరించేయక్కర్లేదులే. స్టార్ గేజింగ్ అను."

"ఊ.. ఏదోలే. ఇక్కడికొచ్చిందా?" రెట్టించాడు.

"ఇక్కడే ఉంటుందిగా! నా రూమ్మేట్ ఇప్పుడు.'

"ఓహ్.. అవునా!" ఫోటో ని దీక్షగా చూసాడు.

"కిచెన్ లోకి రా.. కాఫీ కలుపుదూగాని." గదిలోంచి వెళ్తూ పిలిచింది మహతి.

"నువ్వు తాగిపెడతావా? ఎవడొస్తాడో కానీ అయిపోయాడు."

"ఎవడూ రాడు కానీ.. నీ కబుర్లేంటీ?"

"కబుర్లేముంటాయ్? నువ్వేమైనా చెప్తే వినిపెడతా." కిచెన్ ప్లాట్ ఫాం ఎక్కి కూర్చున్నాడు.

"సీమ ఎలా ఉంది? ఏదైనా గుడ్ న్యూస్? మరీ నల్లపూసైపోయావ్ కదా.. మార్నింగ్ సిక్నెసూలూ అవీ షేర్ చేసుకుంటున్నావేమో అనీ.."

"అంత లేదులే కానీ.. మొన్నవారమేగా కలిసాం మనం?! మధ్యలో ఊరెళ్ళి వచ్చానో రోజు. మీ పెదబాబాయ్ కనిపించారు మార్కెట్ దగ్గర."

"వాళ్ళమ్మాయినే మన పైడ్రాజు తాతయ్య గారి మనవడికి చేసుకున్నారు." కాగిన పాలు మగ్ లో పోసి, ఇన్స్టంట్ కాఫీ పొడి కలుపుతూ చెప్పింది.

"మరి పెదబాబాయ్ అన్నయ్యగారమ్మాయి పెళ్ళెప్పుడో?"

"ఎవరూ? లతా?"

"నా తలకాయ. నీకు జోక్ చెప్పి దానికి అర్ధం చెప్పడం కంటే.." పక్కనున్న గోడకి తలబాదుకుంటున్నట్టూ అభినయించాడు.

పకపకా నవ్వి రెండో కప్ లో పాలు పోసి కాఫీపొడి కలపబోయింది. ఆగమని సైగ చేసి కప్ అందుకుని చెప్పాడు. "కాఫీ మానేసాను."

"అదేంటి! హెల్త్ కాన్షస్!" ఆశ్చర్యంగా అడిగింది.

"ఏం లేదు. ఊరికే మానేద్దామనిపించింది." హాల్ లోకి దారితీసాడు.

"ఇంతకీ ఈ గౌతమి ఫేస్ బుక్ లో ఉన్నట్టుంది కదూ!" టీపాయ్ మీదున్న మేగజైన్ తిరగేస్తూ యథాలాపంగా అడిగినట్టూ..

"ఉందిగా.. నిన్ను యాడ్ చేసుకోమన్నాను మరి. ఇంతకీ నీకు గుర్తొచ్చిందా?" క్రీగంట చూస్తూ అడిగింది. రాకపోతే చెంపదెబ్బనెలా గుర్తుచేద్దామా అని ఆలోచిస్తూ..

"చిన్నప్పుడు కొట్టింది నన్ను.. రాక్షసి!" అన్నాడు సన్నగా నవ్వుతూ.

"హేయ్.. నీకు గుర్తుందన్నమాట! తనకీ గుర్తుంది. నాకిప్పుడెంత ఎక్సైటింగ్ గా ఉందో! మీరిద్దరూ ఎలా మాట్లాడుకుంటారో అని. తనూ వచ్చేస్తూ ఉంటుందీపాటికి." పకపకా నవ్వేస్తూ చెప్పింది మహతి.

"నీ ఎక్సైట్మెంట్ కి భంగపాటు తప్పదమ్మాయ్. ఎందుకంటే.." కప్ టీపాయ్ మీద పెట్టి పైకి లేస్తూ చెప్పాడు. "నాకు టైమైపోతోంది. బయలుదేరుతున్నా.."

"అబ్బా ఉండచ్చు కదా.. ఓ హాయ్ చెప్పి వెళ్ళవోయ్." చెయ్యి పట్టి ఆపుతూ అడిగింది.

"హాయ్ దేముంది! ఎప్పుడైనా చెప్పొచ్చు. సీమ ఒక్కర్తే ఉంటుంది కదా." బయటికి నడిచాడు.

"నువ్వు మరీనూ! నిజం చెప్పూ..నీకు తనని ఫేస్ చెయ్యడానికి ఇబ్బందా?" సీరియస్ గా మొహంలోకి తొంగిచూస్తూ అడిగింది.

"ఈ ఫేస్ కి.." మొహం చుట్టూ చూపుడు వేలితో తిప్పి.. "ఎవర్ని ఫేస్ చెయ్యడానికైనా ఇబ్బందిలేదు. టైమైపోతోంది మహతీ.." గేట్ దాకా వచ్చేసాడు.

"సరేలే.. జాగ్రత్త. మళ్ళీ ఊరెప్పుడెళ్తావో ముందు చెప్పు. నేనూ వస్తా." బైక్ స్టార్ట్ చేస్తున్న శబ్దంలో వినిపించదేమో అని గట్టిగా చెప్పింది.

"బై.. గుడ్నైట్.." తనూ అరిచి చెప్పి నడిపించాడు రోడ్ వైపు.

వీధి గేట్ లోకి అప్పుడే వస్తున్న గౌతమిని చూసి మహతి ఒక్కరుపు అరిచింది.. "వంశీ.. అదిగో గౌతమి.."

●●●

**ఇంకావుంది.**

(రచయిత్రి బ్లాగు http://kothavakaya.blogspot.com/)

COMMENTS